సాక్షి
ఖమ్మం
శుక్రవారం ; 17 ; మార్చి ; 2023



పెద్దలను వదిలేసినట్లేనా?

ఖమ్మం రూరల్ మండలం తనగంపాడులో భూమి అక్రమ రిజిస్ట్రేషన్ విచారణలో అధికారుల తీరు అనుమానాలకు తావిస్తోంది. 8లో



మార్కెట్ ధర ప్రకారం పరిహారం

గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి సేకరించిన భూములకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
31° / 21°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం ఎండ ప్రభావం తక్కువగానే ఉంటుంది. కొన్నిప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశముంది.

ఇసుకాసురులు..

- అనుమతి లేకున్నా యథేచ్ఛగా రవాణా
- ప్రభుత్వ అవసరాల పేరిట కూపన్లు.. ఆపై విచ్చలవిడిగా తరలింపు
- ఆదాయానికి గండిపడుతున్నా పట్టించుకోని యంత్రాంగం
- ఇసుక డిపో మూతపడడంతో బరితెగిస్తున్న అక్రమార్కులు

సాక్షి ఫోకస్



దానవాయిగూడెం రోడ్డులో ట్రాక్టర్లలో విక్రయానికి సిద్ధంగా ఉన్న ఇసుక



ఖమ్మంరూరల్ మండలం పోలేపల్లి వద్ద ఇసుక నిల్వలు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ప్రకృతి సంపద అయిన ఇసుకను అక్రమార్కులు తోడేస్తున్నారు. జిల్లాలో ఎలాంటి రీచ్‌లు లేని కారణంగా.. ప్రభుత్వ అభివృద్ధి పనుల అవసరాలకు తహసీల్దార్లు ఇచ్చే కూపన్లను ఆసరాగా చేసుకుని అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోంది. మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు ఇసుక తరలింపునకు వెన్నుదన్నుగా నిలుస్తుండడం గమనార్హం. ఈక్రమంలో మైనింగ్, రెవెన్యూ, పోలీస్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుండగా.. భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం పొంచి ఉంది.

అవసరాలే అవకాశంగా..

జిల్లాలో నిర్మాణాలకు అనుగుణంగా ఇసుకకు డిమాండ్ పెరిగింది. ప్రభుత్వ అవసరాల కోసం తహసీల్దార్లు కూపన్లు జారీ చేస్తున్నారు. 2018 నుంచి 2021 వరకు జిల్లాలోని ముదిగొండ, బోనకల్, మధిర, ఎర్రుపాలెం, చింతకాని, తల్లాడ మండలాల్లోని వాగుల నుంచి కూపన్ల ద్వారా ఇసుక తరలింపునకు అనుమతించారు. అయితే, కూపన్లకు మించి ఎక్కువ ట్రిప్‌లను వేస్తూ పలువురు అక్రమార్జనకు పాల్పడుతున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు వీరికి కొమ్ముకాస్తుండటంతో మైనింగ్, రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు కూడా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

మూతపడిన ఇసుక డిపో...

గతంలో ప్రభుత్వం ఆధ్వర్యాన ఎన్నెస్పీ రోడ్డులో ఇసుక డిపో ఏర్పాటుచేశారు. ఇక్కడ ఇసుక డంప్ చేసి ప్రజల అవసరాలకు విక్రయించే వారు. కానీ మరికొందరు భద్రాచలంలోని గోదావరి నుంచి ఇసుకను నేరుగా విక్రయిస్తుండడంతో తక్కువ ధరకే లభిస్తోందని పలువురు ఇటే మొగ్గు చూపారు. ప్రభుత్వ డిపోలో మాత్రం ధర ఎక్కువగా ఉండడంతో ఆదరణ లేక ఏడాది క్రితం మూసివేశారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఏపీలోని పలు ప్రాంతాల నుంచి కూడా ఖమ్మంకు ఇసుక తరలిస్తున్నారు.

ఆంధ్రా నుంచి జిల్లాకు..

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ మండలం పల్లగిరి సమీపంలో ఉన్న మున్నేరు నది నుంచి ప్రతిరోజు వందకు పై లారీలు ఓవర్ లోడ్‌తో తెలంగాణలోకి ఇసుక తీసుకొస్తున్నాయి. సరిహద్దు గ్రామమైన దేశినేనిపాలెం నుంచి మధిర మీదుగా ఖమ్మంకు ఇసుక తరలుతోంది. ప్రతిరోజు రాత్రి 10 గంటలు దాటాక లారీల్లో ఇసుక తరలిస్తుండగా.. పైలట్‌గా మూడు, నాలుగు కార్లలో మాఫియా బాధ్యులు దేశినేనిపాలెం నుంచి ఖమ్మం వరకు పర్యవేక్షిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా ఇసుక లారీలను ఆపేందుకు ప్రయత్నిస్తే వారిని కత్తులతో బెదిరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. భారీ వాహనాలు అధిక లోడ్‌తో వస్తుండటంతో రాయపట్నం బ్రిడ్జి, మధిర లోని రైల్వే ఓవర్ బ్రిడ్జి, సిరిపురం వద్ద ఉన్న బ్రిడ్జిలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఈ లారీలు తెలంగాణలోకి ప్రవేశించడానికి ఎలాంటి వే బిల్లులు లేకపోగా.. బుధవారం రాత్రి ఆత్కూరు క్రాస్ రోడ్డు వద్ద కొందరు అడ్డగించారు. ఆ తర్వాత ఆర్‌టీఓ కిషన్‌రావు వెళ్లి మూడు ఇసుక లారీలను సీజ్ చేసి కేసు నమోదు చేశారు.



ఆత్కూరు రోడ్డు వద్ద పట్టుకున్న లారీలను బోనకల్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

కఠిన చర్యలు తీసుకుంటాం...

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు జరిమానా విధిస్తాం. జిల్లాలో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. ప్రభుత్వ అవసరాల కోసం తహసీల్దార్ల నుంచి తీసుకున్న కూపన్ల ద్వారా మాత్రమే ఆయా ప్రాంతాల నుంచే ఇసుక తవ్వి తరలించాలి. అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే దాడులు చేసి జరిమానా విధిస్తున్నాం. ఈ ఏడాది 117 కేసులు నమోదు చేసి రూ.25,68,820 పెనాల్టీ వసూలు చేశాం.

– సంజయ్‌కుమార్, మైనింగ్ ఏడీ, ఖమ్మం

జిల్లాలో ఇదీ తీరు..

- వైరా మండలంలోని ముసలిమడుగు, నారపునేనిపల్లి, గరికపాడు, ఖానాపురం వద్ద వైరా నది నుంచి కొన్నేళ్లుగా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది. అధికారికంగా మండలంలో ఎటువంటి ఇసుక ర్యాంప్‌లు లేకున్నా అభివృద్ధి పనుల పేరుతో పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. పలుమార్లు పోలీసులు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నా దందా ఆగలేదు.
- ముదిగొండ మండలంలోని పెద్దమండవ, గంధసిరి మున్నేరు పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుకను ట్రాక్టర్లలో నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం ప్రాంతాలకు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. పెద్దమండవ, గంధసిరిలోని అధికార పార్టీ నాయకులే దందా చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది.
- ఎర్రుపాలెం మండలంలో కట్టలేరు నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. మండలంలోని తక్కెళ్లపాడు, రాజుల దేవరపాడు, చొప్పకట్లపాలెం సకినవీడుల్లోని రేవుల నుంచి అధికారికంగా ఇసుక రవాణా అవుతుండగా.. రామన్నపాలెం, బనిగండ్లపాడు నుంచి అధికారుల కళ్లు కప్పి తరలిస్తున్నారు.
- ఏపీలోని లింగాల రేవు నుంచి ప్రతిరోజు రాత్రి 10 గంటల తర్వాత పదుల సంఖ్యలో లారీల్లో చింతకాని మీదుగా ఖమ్మంకు ఇసుక రవాణా చేస్తున్నారు.
- నేలకొండపల్లి మండలానికి ఆంధ్రప్రదేశ్‌లోని మల్కాపురం, ముదిగొండ మండలంలోని గంధసిరి నుంచి ఇసుక రవాణా జరుగుతోంది. ఈ మండలంలో గురువారం కూడా పోలీసులు మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు.
- తల్లాడ మండలంలో కుర్నవల్లి గొల్లగూడెం వాగుల నుంచి, తిరుమలాయపాలెం మండలం కాకరవాయి కేంద్రంగా కూడా ఇసుక అక్రమ రవాణా సాగుతోంది.
- సత్తుపల్లి మండలం తమ్మిలేరువాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుంది. సిద్ధారం, తుంబూరు గ్రామాల నుంచి అర్ధరాత్రి ట్రాక్టర్లలో రవాణా చేస్తున్నారు.
- ఖమ్మం నగర శివారు ప్రాంతాలు ఇసుక డంపింగ్ యార్డు కేంద్రాలుగా మారాయి. ఆంధ్రాలోని నందిగామ, మున్నేరు నుంచి తరలించిన ఇసుకను ఇక్కడ డంప్ చేస్తున్నారు. దానవాయిగూడెం, బీసీ కాలనీ, కరుణగిరి చర్చి, బైపాస్‌లోని ఎన్‌ఎస్పీ వెంట డంపింగ్‌యార్డులను ఏర్పాటు చేసి స్థానిక ఇసుకనే గోదావరి ఇసుక పేరిట ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు.

రేబిస్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కుక్కల సంరక్షణ, జాగ్రత్తలపై విస్తృతంగా అవగాహన
- సమీక్ష సమావేశంలో కలెక్టర్ గౌతమ్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు

ఖమ్మం సహకారనగర్: జిల్లాను రేబిస్ రహితంగా తీర్చిదిద్దేందుకు మునిసిపాలిటీ, గ్రామపంచాయతీల బాధ్యులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జంతు జనన నియంత్రణ కేంద్రాలు, కుక్కల స్టెరిలైజేషన్‌పై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుక్కల బారి నుంచి కాపాడుకునేలా ప్రజలు, చిన్నారులకు అవగాహన కల్పించాలని, ప్రమాదాలు జరిగాక చేయించుకోవాల్సిన చికిత్స కూడా వివరించాలని తెలిపారు. ఈమేరకు రద్దీ ప్రాంతాల్లో పోస్టర్ల ద్వారా ప్రచారం చేయాలని చెప్పారు. ఖమ్మంలోని జంతు జనన నియంత్రణ కేంద్రంలో ఇప్పటివరకు 3,658 కుక్కలకు ఆపరేషన్లు చేయగా, మిగతా మునిసిపాలిటీలు, మేజర్ గ్రామ పంచాయతీల్లోనూ భవనాలు గుర్తించాలని సూచించారు. వీధి కుక్కల సంబంధిత ఫిర్యాదులను కేఎంసీ కాల్ సెంటర్‌లో 63018 59174, 79012 98265 నంబర్ల ద్వారా స్వీకరిస్తారనే విషయమై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

సాగునీటిటి ఇబ్బందులు తలెత్తనివ్వొద్దు

జిల్లాలో పంట నష్టం వాటిల్లకుండా పకడ్బందీగా సాగునీటి సరఫరా జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లో ఆయన నీటిపారుదల, వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడుతూ చివరి ఆయకట్టు రైతులకు నీరందేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బోనకల్ మండలం నారాయణపురం, ఆళ్లపాడు, గోవిందాపురం గ్రామాల్లో పంట పాక్షికంగా దెబ్బతిన్నందున నిరంతరాయంగా నీరు విడుదల చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈసమావేశాల్లో అదనపు కలెక్టర్లు స్నేహలత, మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ కలెక్టర్ రాధికగుప్తా, జెడ్పీ సీఈఓ వీ.వీ.అప్పారావు, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి వేణుమనోహర్, డీఎంహెచ్ఓ బి.మాలతి, డీఆర్డీఓ విద్యాచందన, జిల్లా సంక్షేమ అధికారి సంధ్యారాణి, జలవనరుల శాఖ సీఈ శంకర్‌నాయక్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పుల్లారావు, ప్రభాకర్‌రావు, ఆనంద్‌కుమార్, నర్సింగరావు, శ్రీనివాసచారి, ఎం.వెంకటేశ్వర్లు, అనన్య, రామకృష్ణ, పాల్గొన్నారు.

ద్వితీయం.. ప్రారంభం



ఖమ్మంలోని పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

- ప్రశాంతంగా మొదలైన ఇంటర్ సెకండియర్ పరీక్షలు
- 96.39శాతం విద్యార్థుల హాజరు



శ్రీచైతన్య కళాశాల కేంద్రంలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష జరగగా, విద్యార్థులను ఉదయం 8గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని చెప్పడంతో విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 63 కేంద్రాలు ఏర్పాటుచేయగా 15,771మంది విద్యార్థులకు గాను 15,202మంది(96.39శాతం) హాజరయ్యారు. ఇందులో జనరల్ విభాగం నుంచి 13,680మందిలో 13,240మంది, ఒకేషనల్ విభాగంలో 2,091మందిలో 1,962మంది హాజరయ్యారు. కాగా హెచ్‌పీసీ, డీఈసీ, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 38 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశాయని ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు తెలిపారు. ఇక నగరంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ ఎస్.మధుసూదన్ తనిఖీ చేసి ఉద్యోగులకు సూచనలు చేశారు.

న్యూస్‌రీల్

పన్నుల వసూళ్లను పరిశీలించిన కమిషనర్



సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పన్నుల వసూళ్లను కమిషనర్ ఆదర్శ్ సురభి గురువారం పరిశీలించారు. నగరంలోని పలు డివిజన్లలో పర్యటించిన ఆయన సిబ్బందికి సూచనలు చేయడంతో పాటు పన్నులు చెల్లింపు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కాగా, ప్రజలు కేంద్రాలకు రాకుండానే ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించేలా విస్తృత ప్రచారం చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాస్, డీఈ రంగారావు, ఏఈ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం హుండీ ఆదాయం రూ.50.09 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు సమక్షాన కానుకలు లెక్కించగా, వందరోజులకు గాను రూ.50,09,898 ఆదాయం నమోదైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీని వాస శర్మ, ఉద్యోగులు బుర్రి శ్రీనివాస్, కె.విజయకుమారితో పాటు మధిరకు చెందిన శ్రీసత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షలకు 102 కేంద్రాలు



మాట్లాడుతున్న డీఈఓ శర్మ, పక్కన అధికారులు

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లతో సమావేశమయ్యారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా 102 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో 100 రెగ్యులర్ సెంటర్లు కాగా, రెండు సప్లమెంటరీ సెంటర్లు ఉన్నాయన్నారు. కాగా, సెంటర్లలో విధులు నిర్వర్తించే సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించడంతో పాటు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంఈఓ ఎం.శ్రీనివాస్ ప్రధానోపాధ్యాయులు ఆర్.వీరస్వామి, శైలజలక్ష్మి, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ ధన తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి



నర్సరీలో పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

వైరారూరల్: రానున్న వర్షాకాలంలో హరితహారంలో భాగంగా నాటాల్సిన మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్డీఓ ఎం.విద్యాచందన సూచించారు. మండలంలోని లక్ష్మీపురం, స్టేజీ పినపాక, సిరిపురం, తాటిపూడి గ్రామాల్లో నర్సరీలను గురువారం ఆమె తనిఖీ చేసి మాట్లాడారు. రహదారుల వెంట నాటేవే కాకుండా ప్రజలు ఇళ్లలో పెంచుకునే మొక్కలను కూడా సిద్ధం చేయాలని తెలిపారు. ఈ వేసవిలో ఎండకు మొక్కలు ఎండిపోకుండా సంరక్షించాలని చెప్పారు. అలాగే, ఉపాధి హామీ కూలీలకు నర్సరీల్లో ఉపాధి కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీఓ జ్యోత్స్నాదేవితో పాటు అనురాధ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన శాఖలో పదోన్నతులు వెనక్కి..

సంక్షేమ అధికారి కోర్టుకు వెళ్లడంతో నిర్ణయం

ఖమ్మంమయూరిసెంటర్: గిరిజన సంక్షేమశాఖలో వసతిగృహ సంక్షేమ అధికారుల గ్రేడ్లను రివర్షన్ చేస్తూ శాఖ కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సీనియర్ హెచ్‌డబ్ల్యూఓ అయిన తనకు కాకుండా జూనియర్లకు గ్రేడ్–1 పోస్టులు ఇచ్చారంటూ సంక్షేమ అధికారి అరుణ కోర్టుకు వెళ్లడంతో ఆమెకు అనుకూలంగా కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు రికార్డులను పరిశీలించి ఖమ్మం జిల్లాలో వసతిగృహ సంక్షేమ అధికారులు పలువురి గ్రేడ్లను రివర్షన్ చేశారు. ఈమేరకు 19 మంది వసతిగృహ సంక్షేమ అధికారులతో సీనియారిటీ జాబితా వెలువరించారు. గిరిజన శాఖకు సంబంధించి జిల్లాలో నాలుగు గ్రేడ్–1 పోస్టులు ఉండగా, ఒక పోస్టులో నేరుగా నియామకమైన ఉద్యోగి ఉన్నారు. మిగిలిన పోస్టుల్లో సీనియారిటీ ఆధారంగా నియమించనున్నారు. తొలి నాలుగు స్థానాల్లో యు.భారతిదేవి, ఎం.అరుణకుమారి, కె.అరుణ, బి.రూపాదేవి ఉండగా.. గ్రేడ్లు రివర్షన్ కావడంతో జిల్లాలో ఏటీడీఓ బాధ్యతలు మారనున్నాయనే చర్చ జరుగుతుంది. కాగా, ఐటీడీఏ పీఓ నుండి ఈ విషయంలో ఉత్తర్వులు రావాల్సి ఉంది. ఈ అంశంపై గిరిజన సంక్షేమశాఖ డీడీ కృష్ణనాయక్‌ను వివరణ కోరగా కమిషనర్ కార్యాలయం నుండి గ్రేడ్ల రివర్షన్‌పై ఉత్తర్వులు అందాయని, సీనియారిటీ జాబితాను కూడా ఉన్నతాధికారులు పంపించారని తెలిపారు. ఆ తర్వాత నిర్ణయం ఐటీడీఏ పీఓ తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

నవమి ఏర్పాట్లపై 20న మంత్రి సమీక్ష

నేడు పరిశీలించనున్న భద్రాద్రి కలెక్టర్ అనుదీప్



ఆలయ అధికారులకు వసతి సముదాయ పత్రాలను అందజేస్తున్న టీటీడీ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో ఈ నెల 22వ తేదీ నుంచి వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి తిరుకల్యాణ నవాహ్నిక బ్రహ్మోత్సవాలు, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక ప్రయుక్త ద్వాదశ కుండాత్మక చతుర్వేద సహిత శ్రీరామాయణ మహాక్రతువు ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో శ్రీరామనవమి ఉత్సవ ఏర్పాట్లపై ఈ నెల 20న రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్ కుమార్ ఆధ్వర్యంలో భద్రాచలంలోని సబ్ కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం జరగనుంది. కలెక్టర్ అనుదీప్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించి, అధికారులతో సమీక్షించనున్నారు. కాగా రామాలయంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి ఏపీ రాష్ట్రం విజయనగరానికి చెందిన తాళ్లపూడి అప్పారావు, కుమారి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు.

టీటీడీ సత్రం ఆలయానికి అప్పగింత

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో భద్రాచలంలోని తానీషా కల్యాణ మండపం వెనుక రూ.4.75 కోట్లతో నిర్మించిన యాత్ర వసతి సదుపాయం(సత్రం)ను టీటీడీ అధికారులు గురువారం రామాలయానికి అప్పగించారు. ఈఈ రవీందర్, ఏఈఓ భవానీ రామకృష్ణకు సంబంధిత పత్రాలను అందజేశారు. 33 గదులు, డార్మెటరీ హాళ్లతో నిర్మించిన ఈ సత్రంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఏసీలు, ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యాలను సమకూర్చాల్సి ఉంది. అనంతరమే భక్తులకు ఈ వసతి గృహం అందుబాటులోకి రానుంది. ఈ శ్రీరామనవమికి గదులు అందుబాటులోకి వస్తాయని భావించిన భక్తులకు మళ్లీ నిరాశే ఎదురయింది.

అకాలవర్షం.. ఆగమాగం

- జిల్లాలోని పలుప్రాంతాల్లో ఈదురుగాలులు, వడగండ్లు
- నేలవాలిన మొక్కజొన్న చేన్లు
- అక్కడక్కడా నేలరాలిన మామిడిపిందెలు
- మరో మూడు రోజుల వర్షసూచనతో రైతుల్లో గుబులు



చింతకాని మండలం లచ్చగూడెంలో మొక్కజొన్న రాశులపై పట్టాలు కప్పుతున్న రైతులు



మధిర మండలం మల్లారంలో నేలవాలిన మొక్కజొన్న పంట

ఖమ్మంవ్యవసాయం: అకాల వర్షం జిల్లాలో అన్నదాతను ఆందోళనకు గురిచేసింది. చేతికందే దశలో ఉన్న వరి, మొక్కజొన్న.. కల్లాల్లో మిర్చి ఉన్న నేపథ్యాన గురువారం సాయంత్రం ఆకాశంలో ఒక్కసారిగా వచ్చిన మార్పులకు తోడు ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ కారణంగా పలు చోట్ల మొక్కజొన్న చేన్లు నేలముఖం వేయగా, మామిడి పిందెలు నేలరాలాయి. ఉపరితల ద్రోణి కారణంగా గురువారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటూ సాయంత్రానికి ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులతో కూడిన వర్షం ప్రారంభమైంది. ఈ ప్రభావం మూడు రోజులు ఉంటుందని అధికారులు చెబుతుండడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

అకాల వర్షాలతో పంటలకు నష్టం

జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో అన్ని పంటలు కలిపి 3,14,936 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఉద్యాన పంటల్లో ప్రస్తుతం పంట చేతికందే మామిడి 33,800 ఎకరాల్లో ఉంది. కోతలు ప్రారంభించాలని అనుకుంటున్న మామిడి రైతులకు ఈ వర్షంతో నష్టమేనని చెబుతున్నారు. మామిడి కాయ నేల రాలితే రైతులు ధరను కోల్పోయే ప్రమాదం ఉండడంతో పాటు ఎగుమతులకు పనికిరాదనే ఆందోళన నెలకొంది. కాగా, సత్తుపల్లి, కూసుమంచి వ్యవసాయ డివిజన్లలో వరి చేతికందే దశకు చేరగా.. అకాల వర్షాలకు పంట దెబ్బతినే ప్రమాదం నెలకొంది. ఇక వర్షం ప్రభావం మొక్కజొన్నపై కూడా పడింది. కొణిజర్ల, వైరా, బోనకల్, నేలకొండపల్లి, మధిర తదితర ప్రాంతాల్లో మొక్కజొన్న నేలవాలింది. అలాగే, ఇప్పటికే కోసి కల్లాల్లో ఆరబోసిన మొక్కజొన్నతో పాటు మిర్చిని కాపాడుకునేలా పట్టాలు కప్పేందుకు రైతులు పరుగులు తీశారు.

మరికొన్ని ఫొటోలు.. 8లో



వైరా మున్సిపాలిటీ పరిధి పల్లిపాడులో కురిసిన వడగండ్లు

రక్షణ చర్యలు చేపట్టండి..

అకాల వర్షాల కారణంగా పంటలు దెబ్బతినకుండా రైతులు జాగ్రత్త వహించాలి. కల్లాల్లో ఉన్న మిర్చి, మొక్కజొన్న వంటి పంటలను రాశులుగా చేసుకొని టార్పాలిన్లు కప్పాలి. మొక్కజొన్న, వరి కోతకు సిద్ధమైనందున వాతావరణాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి. రైతులు ఎప్పటికప్పుడు వాతావరణ స్థితిగతులను గమనిస్తూ అందుకు అనుగుణంగా వ్యవసాయ పనులు, పంట కోతలు చేపట్టాలి.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

క్లుప్తంగా

భట్టి విక్రమార్క యాత్రకు జిల్లా నేతలు



భట్టితో డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

ఖమ్మంసహకారనగర్/నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్: సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆదిలాబాద్‌లో గురువారం ప్రారంభించిన హాథ్ సే హాథ్ యాత్రకు జిల్లా నుంచి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. జిల్లాకు చెందిన భట్టి విక్రమార్క రాష్ట్రస్థాయిలో యాత్రను నిర్వహిస్తుండడంతో జిల్లా పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన నాయకులు బయలుదేరారు. జిల్లా కేంద్రంతోపాటు నేలకొండపల్లి నుంచి టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కార్పొరేటర్లు మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, భూక్యా బాలాజీనాయక్‌తో పాటు నాయకులు యడ్లపల్లి సంతోష్, హుస్సేన్, శేఖర్‌గౌడ్, బొందయ్య, బానోతు బాలాజీనాయక్, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, యాతాకుల శ్రీనాథ్, తెలగమళ్ల నరేశ్, చిన్నానాయక్, సంతోష్, తదితరులు ఆదిలాబాద్ వెళ్లిన వారిలో ఉన్నారు.

నేడు శ్రీకృష్ణప్రసాద్ పశువుల సంత వేలం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం కొమ్మినేపల్లిలోని పండితాపురం శ్రీ కృష్ణప్రసాద్ పశువుల సంత నిర్వహణకు శుక్రవారం వేలం నిర్వహిస్తునట్లు సర్పంచ్ మూడ్ దుర్గాజ్యోతి, పంచాయతీ కార్యదర్శి నెహ్రూ తెలిపారు. పీసా చట్టం ప్రకారం గ్రామపంచాయతీ పరిధిలోని షెడ్యూల్ తెగకు సంబంధించి కుల ధ్రువీకరణ పత్రం ఉన్న వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు వేలం మొదలవుతుందని, అత్యధిక ధర కోట్ చేసిన వారు సాయంత్రం 4 గంటల్లోగా సొమ్ములో 1/3 శాతం నగదు చెల్లించకపోతే రెండో పాటదారుడికి సంత కొలు అప్పగిస్తామని తెలిపారు. కాగా, వేలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోతే రద్దు చేస్తామని వెల్లడించారు.

ఇసుక లారీలు స్వాధీనం

చింతకాని/నేలకొండపల్లి: ఏపీ నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను చింతకాని పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం లారీలను మైనింగ్ అధికారులకు అప్పగించామని ఎస్‌ఐ పి.వెంకన్న తెలిపారు. అలాగే, ఏపీలోని మల్కాపురం నుంచి మూడు ఇసుక ట్రాక్టర్లు నేలకొండపల్లి వైపు వస్తుండగా నాచేపల్లి వద్ద స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

వైరారూరల్: ఆటోను ఎదురుగా వచ్చి ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటన వైరా మండలం స్టేజీ పినపాక సమీపాన జాతీయ ప్రధాన రహదారిపై గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. వైరా నుంచి కనకగిరిసిరిపురానికి ఆటో వెళ్తుండగా.. సత్తుపల్లి నుంచి కరీంనగర్‌కు వెళ్లే సత్తుపల్లి డిపో బస్సు పూర్తిగా కుడివైపు వచ్చి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం ధ్వంసం కావడమే కాక పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ నారపోగు రాజారావుకు ఒక కాలు, చేయి విరిగి తీవ్రగాయాలు కాగా, ఆయనను ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ శాఖమూరి వీరప్రసాద్ తెలిపారు.

హరిభూషణ్ పేరుతో నగదు వసూళ్లు

బయ్యారం: మావోయిస్ట్ రాష్ట్ర మాజీ కార్యదర్శి హరిభూషణ్ పేరుతో వసూళ్లు, కిడ్నాప్‌లకు పాల్పడుతున్న నలుగురు ముఠా సభ్యులను మహబూబాబాద్ జిల్లా బయ్యారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఈమేరకు వివరాలను ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు వెల్లడించారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన దళ కమాండర్ ముత్తయ్య అలియాస్ ఆజాద్, బయ్యారానికి చెందిన మాజీ నక్సలైట్ పసుల లింగయ్య అలియాస్ లింగన్న, ఖమ్మం బల్లేపల్లికి చెందిన బత్తుల రామకృష్ణ, బయ్యారానికి చెందిన మాజీ ప్రజాప్రతిఘటన ఆర్గనైజర్ నిమ్మల లింగయ్య ముఠాగా ఏర్పడ్డారు. గత ఏడాది డిసెంబర్‌లో ఇల్లెందు నుంచి కొత్తపేటలోని తన వ్యవసాయ భూమి వద్దకు వచ్చిన వ్యాపారి యాదగిరిరెడ్డిని ఎయిర్‌గన్‌తో బెదిరించి హరిభూషణ్ పేరిట రూ.20 లక్షలు డిమాండ్ చేయగా డబ్బు ఇవ్వకపోవటంతో కిడ్నాప్ చేశారు. ఆతర్వాత రూ.1.20 లక్షలు తీసుకుని విడుదల చేశారు. బయ్యారంలో వాహన తనిఖీల్లో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ రమణబాబు తెలిపారు. నిందితుల అరెస్టులో కీలకంగా వ్యవహరించిన సీఐలు మోహన్, బాలాజీ, ఎస్‌ఐలు రామారావు, రమాదేవి, సిబ్బంది పాపయ్య, రాజశేఖర్, విజయ్, బాలు, సుమన్, మధుసూదన్‌రెడ్డికి రివార్డులు అందజేశారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ఠ	కనిష్ఠ
పెసలు	7,650	7,600
కందులు	7,980	7,000
మిర్చి	23,000	18,300
మిర్చి తాలు	14,000	9,000
పత్తి	7,300	5,000

– ఖమ్మం వ్యవసాయం

ఉరుకులు.. పరుగులు..

అకాల వర్షంతో రైతుల్లో ఆందోళన

జిల్లావ్యాప్తంగా గురువారం ఉదయం నుంచి వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. వారం రోజులుగా ఉదయం నుంచే ఎండ మొదలవుతుండగా గురువారం మాత్రం అందుకు విరుద్ధమైన పరిస్థితులు కనిపించాయి. ఈ మార్పులతో రైతులు ఆందోళన చెందుతుండగానే సాయంత్రానికి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలతో కూడిన వర్షం మొదలైంది. దీంతో కల్లాల్లో ఆరబోసిన మిర్చి, మొక్కజొన్న రాశులను కాపాడుకునేందుకు పరుగులు తీశారు. అయినప్పటికీ పలుచోట్ల మొక్క జొన్న పంట నేలవాలగా.. మామిడి తోటల్లో పిందెలు నేలరాలాయి. జిల్లాలోని మధిర, బోనకల్, చింతకాని, ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల, ఏన్కూరు, కారేపల్లి, సత్తుపల్లి, తల్లాడ, నేలకొండపల్లి, కూసుమంచి మండలాల్లో వర్ష ప్రభావం కనిపించింది. కాగా, కారేపల్లి మండలం సూర్యతండాలో రైతు ధరావత్ రవికి చెందిన ఆవుదూడ పిడుగుపాటుతో మృత్యువాత పడింది. ఇక వైరా మండలం దాచాపురంలో మాజీ సర్పంచ్ వేల్పుల శౌరి ఇంట్లో షెడ్డుపై భారీ వృక్షం నేలకూలడంతో షెడ్డుతో పాటు ప్రహరి ధ్వంసమైంది.

– సాక్షినెట్‌వర్క్



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి బస్తాలపై టార్పాలిన్లను కప్పి ఉంచిన దృశ్యం, (ఇన్‌సెట్) తల్లాడ: వర్షానికి రహదారిపై నిలిచిన వరదనీరు



బోనకల్: ఆళ్లపాడులో నేలకొరిగిన మొక్కజొన్నను చూపుతున్న రైతులు



మధిర : ప్రధాన రహదారిపై వర్షం నీరు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో కురుస్తున్న వర్షం



వైరా: వర్షంలో లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనదారులు



కారేపల్లి: సూర్యతండాలో పిడుగుపాటుకు మృతి చెందిన ఆవుదూడ

పెద్దలను వదిలేసినట్లేనా?

- నకిలీ ధ్రువపత్రాలతో భూరిజిస్ట్రేషన్ కేసులో అనుమానాలు
- వ్యవహారంలో రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం
- కొందరి అరెస్టుతోనే సరిపెట్టడంపై విమర్శలు

ఖమ్మంరూరల్: రూ.కోట్ల విలువైన భూమిని అక్రమ మార్గంలో నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యవహారంలో అధికారులు పెద్ద చేపలను వదిలేసి.. కేవలం కొందరు వ్యక్తుల అరెస్టుతో సరిపెడతారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖమ్మంరూరల్ మండలం తనగంపాడులో విలువైన భూమి కలిగిన వ్యక్తి హైదరాబాద్‌లో ఉంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న ఓ వ్యక్తి.. యజమాని దంపతులు మృతి చెందారని నకిలీ మరణ ధ్రువపత్రాలు, తానే వారసుడినని మరో సర్టిఫికెట్ సాధించి భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఆ తర్వాత మరికొందరికి అమ్మేశారు. ఈ కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేసినట్లు ప్రకటించారు. ఇంతవరకు బాగానే ఉన్నా వ్యవహారంలో అసలు సూత్ర, పాత్రధారులెవరు? వారి విచారణ విషయమేమిటనే ప్రశ్నకు సమాధానం చెప్పడం లేదు. మొత్తం వ్యవహారంలో ఓ ప్రభుత్వ అధికారి, మరో కీలక వ్యక్తి ఉన్నా కేసు నుంచి మినహాయించారనే ప్రచారం జరుగుతోంది.

నకిలీవని తెలియదా?

సంబంధిత భూయజమాని, భార్య బతికి ఉండగానే మృతి చెందినట్లుగా భూబకాసురులు మీసేవ కేంద్రం నుంచి మరణ ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. వాటిని సమర్పించినప్పుడు రెవెన్యూ అధికారులు గుడ్డిగా రిజిస్ట్రేషన్ చేయడం వెనుక పెద్ద మతలబే ఉన్నట్లు తెలుస్తోంది. ఏదైనా పనిపై సామాన్యులు రెవెన్యూ కార్యాలయానికి వెళ్తే సవాలక్ష ప్రశ్నలు, నానా కొర్రీలతో ఇబ్బంది పెట్టే అధికారులు.. నకిలీ సర్టిఫికెట్లను మాత్రం గుర్తించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లోతుగా విచారించాకే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించినా పని ఎలా పూర్తయిందన్నది తెలియరావడం లేదు. స్లాట్ బుకింగ్ తర్వాత, ఆర్‌ఐ నివేదిక ఆధారంగా రిజిస్ట్రేషన్ చేశామని రెవెన్యూ అధికారులు చెబుతుండడంపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక నకిలీ సర్టిఫికెట్ల విషయం బయటకు రావడంతో అప్పుడు 'హడావుడిలో చూసుకోలేదు.. సీడీఎంఏ ద్వారా రిజిస్ట్రేషన్ కోసం సమర్పించిన డెత్ సర్టిఫికెట్ నకిలీదని గుర్తించాం' అని వెల్లడించడానికి భారీగా నగదు చేతులు మారడమే కారణమని ప్రచారం జరుగుతోంది.

ఇంకెప్పుడు?

మొత్తం వ్యవహారంలో అసలు సూత్ర, పాత్రధారులు ఇంకొందరిని అరెస్ట్ చేయాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. తొలుత ఐదుగురిని అరెస్టు చేసినప్పుడు ఈ విషయం చెప్పగా.. ఇప్పటి కూడా మరెవరినీ అరెస్టు చేయకపోవడం గమనార్హం. ఈ వ్యవహారంలో నేలకొండపల్లికి చెందిన రియల్టర్‌కు, ప్రధాన పాత్ర పోషించిన వ్యక్తికి ఘర్షణ జరిగిన విషయం విదితమే. దీంతో కీలకమైన వ్యక్తులను అరెస్టు చేస్తారా, ఇప్పటికే అరెస్ట్ చేసిన ఐదుగురితో సరిపెడతారా అనేది తేలాలంటే వేచి ఉండాల్సిందే.

మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాల్సిందే..



రైతులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్, ఆర్డీఓ

బోనకల్: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి భూములు ఇచ్చిన తమకు మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లించాల్సిందేనని రైతులు స్పష్టం చేశారు. కానీ, ధరణి పోర్టల్ ప్రకారం ప్రభుత్వ భూమి ధర ఎంత ఉందో అందుకు మూడు రెట్లు పరిహారం చెల్లిస్తామని అధికారులు తెలిపారు. హైవే నిర్మాణానికి భూములు కోల్పోనున్న రైతులతో గురువారం పెద్దబీరువల్లి, చిన్నబీరువల్లి రైతువేదికల్లో అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఆర్డీఓ రవీంద్రనాథ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు గ్రామాల్లో 64 ఎకరాల మేర భూమి సేకరించగా, చిన్నబీరువల్లిలో ఎకరాకు రూ.10 లక్షలు, పెద్దబీరువల్లిలో రూ.13 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని తెలిపారు. అయితే, రైతులు మాత్రం ప్రధాన రహదారి పక్కన పొలాలకు రూ.కోటి ధర పలుకుతున్నందున తమకు కూడా మార్కెట్ ధర ప్రకారం పరిహారం ఇవ్వాలని కోరారు. దీంతో విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అధికారులు హామీ ఇచ్చారు. సమావేశాల్లో ఇన్‌చార్జ్ తహసీల్దార్ శ్వేత, ఆర్‌ఐ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రిసెప్షన్ ఆఫీసర్‌గా మాధవి

మధిర: మధిర రూరల్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ ఉత్తమ రిసెప్షన్ ఆఫీసర్‌గా ఎంపికైంది. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన సమావేశంలో ఆమె ఉన్నతాధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకుంది. అలాగే, జిల్లాలోని బోనకల్ పోలీస్‌స్టేషన్ నుంచి లక్ష్మీకుమారి కూడా అవార్డుకు ఎంపికైంది. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారి నుంచి ఫిర్యాదుల స్వీకరణ, సలహాలు ఇవ్వడం, పనులు పెండింగ్‌లో లేకుండా చేస్తున్న వారికి ఈ అవార్డులు ప్రకటించారు. కాగా, అవార్డు సాధించినవారిని మధిర సీఐ ఒడ్డేపల్లి మురళి తదితరులు అభినందించారు.



హైదరాబాద్‌లో అవార్డు అందుకుంటున్న మాధవి

అధికారులకు తెలియకుండానే ట్యాంకు కూల్చివేత



సోమవరంలోని వాటర్ ట్యాంకు (ఫైల్)

వైరా: మున్సిపాలిటీ, మిషన్ భగీరథ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే వైరా మున్సిపాలిటీ పరిధిలో శిథిలావస్థకు చేరిన తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకు కూల్చివేసిన ఘటన ఇది. మున్సిపాలిటీ పరిధి 10వ వార్డు సోమవరం శివారులో నలభై ఏళ్ల కిందట ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మించారు. ప్రస్తుతం మిషన్ భగీరథ పథకంలో భాగంగా శిథిలావస్థకు చేరిన ట్యాంకులు కూల్చి వేసి కొత్త ట్యాంకులు నిర్మిస్తున్నారు. అయితే, సోమవరంలో 90 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకును డిసెంబర్ 12న మున్సిపల్ కౌన్సిల్, కమిషనర్‌కు చెప్పకుండానే కూల్చివేసిన విషయాన్ని తాజాగా గుర్తించారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ అనిత గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వీరప్రసాద్ విచారణ చేపట్టారు. కాగా, ఇటీవల మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్‌పై కౌన్సిలర్లు కలెక్టర్‌కు చేసిన ఫిర్యాదులో ట్యాంకు కూల్చివేత అంశం కూడా ఉండటం, ఇప్పుడు కమిషనర్ అనిత పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది.

పురుగుల బెడదతో పాఠశాల మార్పు

వైరారూరల్: మండలంలోని లింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో పురుగుల బీభత్సంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారు. నెల రోజుల నుంచి పాఠశాలలో పురుగులు స్వైరవిహారం చేస్తుండగా, ఇవి కుట్టిన విద్యార్థుల శరీరంపై దద్దులు వస్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు. సమీపంలోని చింత చెట్ల నుంచి ఈ పురుగులు వస్తున్నట్లు తెలుస్తుండగా, బ్లీచింగ్ పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. దీంతో పాఠశాలను తాత్కాలికంగా గురువారం మాజీ సర్పంచ్ కొరకొప్పు వెంకటరత్నం ఇంట్లోకి మార్చారు.

22 మంది మహిళల బైండోవర్

దీక్ష శిబిరం నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలింపు



దీక్షా శిబిరం నుంచి మహిళలను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కల్లూరు/సత్తుపల్లిరూరల్: డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ దీక్ష చేపట్టిన 22 మంది మహిళలను బైండోవర్ చేశారు. సదరు మహిళలు 25 రోజులుగా స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోలేదని చెబుతూ బుధవారం సాయంత్రం డబుల్ బెడ్‌రూం గృహాల వద్ద వంటావార్పుతో నిరసన తెలపగా బుధవారం తహసీల్దార్ బాబ్జీప్రసాద్ చేరుకుని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పారు. అయినా వినకపోవడంతో వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించగా, తహసీల్దార్ సమక్షంలో ఎస్‌ఐ రఘు ఆధ్వర్యాన బైండోవర్ కేసు నమోదు చేశారు. కాగా, మహిళలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే బైండోవర్ చేయడం గర్హనీయమని వివిధ పార్టీల నాయకులు పేర్కొన్నారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటూరి మానవతారాయ్‌తో పాటు ప్రజాపంథా, ఐఎఫ్‌టీయూ, పీఓడబ్ల్యూ, పీవైఎల్ నాయకులు గంటా శ్రీనివాస్, ఎ.శరత్, ఎ.వెంకన్న, బీరెల్లి లాజర్, జె.మాల్యాద్రి, కె.పుల్లారావు, లలిత, ఝాన్సీ, ఎన్‌వీ రాకేశ్ తదితరులు వేర్వేరు ప్రకటనల్లో ఖండించారు.

నేడు బీఆర్‌ఎస్ సమావేశం

సత్తుపల్లి: సత్తుపల్లి నియోజకవర్గ బీఆర్‌ఎస్ కీలక సమన్వయ సమావేశాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. పార్టీ పెనుబల్లి మండల అధ్యక్షుడు కనకగాల వెంకట్రావ్ నివాసంలో ఈ సమావేశం జరగనుండగా, నియోజకవర్గంలో ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు, అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని సూచనలు చేయనున్నట్లు సమాచారం. మండల, జోనల్ కమిటీల అధ్యక్షులు, ప్రజాప్రతినిధులతో పాటు ఇతర ముఖ్యులు హాజరుకావాలని ఇప్పటికే సమాచారం ఇచ్చారు. గత ఆదివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటుచేయగా.. ఇరువర్గాల నడుమ ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యాన ఎమ్మెల్యే సండ్ర ఆధ్వర్యాన శుక్రవారం జరిగే సమావేశంలో నియోజకవర్గంలో వివిధ అంశాలపై చర్చించడమే కాకుండా మండలాల వారీగా ఆత్మీయ సమ్మేళనాల షెడ్యూల్ ఖరారైనట్లు సమాచారం. కాగా, ఈసమావేశం వివరాలు బయటకు పొక్కకుండా చూడాలని పార్టీ నేతలకు సూచించినట్లు తెలిసింది.

● కమ్మిన కారుమబ్బులు!



జిల్లా కేంద్రంలో గురువారం సాయంత్రం ఉన్నట్లుండి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేయగా జల్లులతో వర్షం మొదలైంది. ఆ తర్వాత ఈదురుగాలులతో కొన్ని చోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. అయితే, వర్షం రావడంతో ఇన్నాళ్లు ఎండ వేడితో అల్లాడిన నగర వాసులు సేదతీరారు. –స్టాఫ్‌ఫొటోగ్రాఫర్

పెళ్లికి నిరాకరిస్తున్నాడని యువతి ఆందోళన

కారేపల్లి: పెళ్లి సంబంధం మాట్లాడుకున్నాక ఇప్పుడు వివాహానికి నిరాకరిస్తున్నాడని అబ్బాయి ఇంటి ముందు ఓ అమ్మాయి ఆందోళనకు దిగింది. మండలంలోని ఆలియాతండాకు చెందిన గుగులోతు కల్యాణ్, బర్లగూడెంకు చెందిన భూక్యా స్నేహకు ఏడాది కిందట పెళ్లి నిశ్చయించారు. ఇటీవల రెండు కుటుంబాల నడుమ మనస్పర్థలు రావడంతో అబ్బాయి తరఫు వారు పెళ్లికి నిరాకరించారు. దీంతో తనకు కల్యాణ్‌తోనే వివాహం జరిపించాలని డిమాండ్ చేస్తూ స్నేహ ఆయన ఇంటి ఎదుట గురువారం ఆందోళనకు దిగింది. దీంతో ఎస్‌ఐ పి.రామారావు చేరుకుని ఇంటి ఎదుట ఆందోళన చేయటం సరికాదని, ఏదైనా ఉంటే చట్టప్రకారం వెళ్లాలని నచ్చచెప్పడంతో స్నేహ ఆందోళన విరమించింది.

● సంక్షేమంతో కూడిన అభివృద్ధే లక్ష్యం

ఐదవసారీ అదే దారి

రూ.2,79,279.27 కోట్లతో 2023-24 ఏపీ వార్షిక బడ్జెట్

- అన్ని రంగాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనే ధ్యేయం
- వైఎస్సార్ పెన్షన్ కానుక కోసం రూ.21,434 కోట్లు
- వచ్చే ఏడాది జనవరిలో పెన్షన్ రూ.3 వేలకు పెంపు
- మహిళలు, పిల్లల పథకాలకు ప్రత్యేక కేటాయింపులు
- మహిళల పథకాలకు రూ.77,914.43 కోట్లు
- పిల్లల పథకాలకు రూ.20,593.38 కోట్లు
- సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, సాగు నీరు, మౌలిక రంగాలకు పెద్ద పీట



మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్

మంచి చదువు, మంచి వైద్యం, మంచి ఆరోగ్యం, రైతుల్లో సంతోషం, నా అక్క చెల్లెమ్మల్లో సాధికారత, జోరైన పారిశ్రామికాభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా మరోసారి సంక్షేమ-అభివృద్ధి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాం. అసమానతలు తగ్గించి, పేదరికాన్ని నిర్మూలించే దిశగా ఈ బడ్జెట్ ద్వారా మరో అడుగు ముందుకేశాం.
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన మాట నెరవేర్చడమే లక్ష్యంగా అన్ని వర్గాల అభ్యున్నతికి అండగా నిలిచే అభివృద్ధి, సంక్షేమ సమతుల్యతతో కూడిన బడ్జెట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీకి సమర్పించింది. జెండర్ బేస్డ్ బడ్జెట్ ద్వారా సమాజంలో సగం ఉన్న మహిళలకు ప్రత్యేక కేటాయింపులు చేశారు. పిల్లలకు కూడా ప్రత్యేక కేటాయింపులు చేయడం విశేషం. అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనగా వరుసగా ఐదోసారి రూ.2,79,279.27 కోట్లతో 2023-24 వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఉదయం 10 గంటలకు అసెంబ్లీకి సమర్పించారు. ఇందులో రెవెన్యూ వ్యయం రూ.2,28,540.71 కోట్లుగా, మూల ధన వ్యయం రూ.31,061 కోట్లుగా ఉంటుందని అంచనా వేసినట్లు బుగ్గన పేర్కొన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.23,316.70 కోట్లు రెవెన్యూలోటు, రూ.54,587.52 కోట్లు ద్రవ్యలోటు ఉంటుందని అంచనా వేశామని తెలిపారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూ లోటు 3.77 శాతం, ద్రవ్యలోటు 1.54 శాతం ఉంటుందని, రెవెన్యూ ఆదాయం 2,06,224.01 కోట్లుగా అంచనా వేశామన్నారు. ఇందులో కేంద్ర పన్నుల వాటా నుంచి రూ.41,338.02 కోట్లు వస్తాయని, కేంద్రం నుంచి గ్రాంట్లరూపంలో రూ.46,834.64 కోట్లు వస్తాయని అంచనా వేసినట్లు తెలిపారు. రెవెన్యూ లోటుతో పాటు ద్రవ్య లోటును అదుపులో పెట్టే చర్యలు తీసుకున్నట్లు బడ్జెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. అంతకు ముందు ఉదయం 8 గంటలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో కేబినెట్ సమావేశమై 2023-24 వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపింది.

నవరత్నాలకు పెద్దపీట

ఎప్పటిలాగే మేనిఫెస్టోలోని నవరత్నాల పథకాల కొనసాగింపునకు బడ్జెట్‌లో తగిన కేటాయింపులు చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికలతో పాటు మైనారిటీ యాక్షన్ ప్రణాళిక పేరుతో భారీ ఎత్తున నిధులు కేటాయించారు. మొత్తం మీద రాష్ట్రంలోని ఐదు కోట్ల ప్రజానీకాన్ని సంతృప్తి పరిచే స్థాయిలో బడ్జెట్ ప్రతిపాదనలు చేశారు. మరో పక్క వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, సాగునీటి రంగాల్లో మౌలిక రంగాలకు పెద్ద పీట వేశారు. బడ్జెట్‌లో ఎక్కడా దాపరికాలు లేకుండా పూర్తి పారదర్శకత ప్రదర్శించారు. ఏయే రంగాల్లో ఏయే పథకాలకు ఎన్ని నిధులు కేటాయించింది స్పష్టంగా వివరించారు. అవ్వా తాతల సామాజిక పెన్షన్లను వచ్చే ఏడాది జనవరిలో నెలకు 3 వేల రూపాయలు చేస్తామని ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వైఎస్సార్ పెన్షన్ కానుకకు ఏకంగా రూ.21,434 కోట్లు కేటాయించారు. నవరత్న పథకాల్లోని అన్ని వర్గాలకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మైనారిటీ వర్గాలకు చెందిన లబ్ధిదారులకు అందజేసే అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంక్షేమ పథకాలన్నింటినీ ఆయా సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా అమలు చేస్తామని స్పష్టం చేసింది.

సచివాలయాలకు కేటాయింపులు: చిరు వ్యాపారులు, ఆటో డ్రైవర్లు, నాయీ బ్రాహ్మణులు, రజకులు, మత్స్యకారులు, దర్జీలు, చేనేత కార్మికులు, కాపులు, లాయర్లకు బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. గ్రామ, వార్డు వలంటీర్లు.. గ్రామ, పట్టణ సచివాలయాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. నేరుగా నగదు బదిలీచేసే 22 నవరత్నాల పథకాలకు బడ్జెట్‌లో రూ.54,228 కోట్లు కేటాయించారు. మహిళల పథకాలకు ప్రత్యేకంగా రూ.77,914.43 కోట్లు, పిల్లల పథకాలకు ప్రత్యేకంగా రూ.20,593.38 కోట్లు కేటాయించారు. బీసీ ఉప ప్రణాళికకు రూ.38,605 కోట్లు, ఎస్సీ ఉప ప్రణాళికకు రూ.20,005 కోట్లు, ఎస్టీ ఉప ప్రణాళికకు రూ.6,929 కోట్లు, మైనారిటీ కాంపొనెంట్‌కు రూ.4,203 కోట్లు కేటాయించారు. సంక్షేమానికి రూ.51,345 కోట్లు, సాధారణ విద్యా రంగానికి రూ.32,198 కోట్లు, ఆరోగ్య రంగానికి రూ.15,882 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.14,043 కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.17,531 కోట్లు కేటాయించారు.

రైతుల సంక్షేమంపై శ్రద్ధ

రైతుల సంక్షేమంపై శ్రద్ధ చూపుతూ బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. రైతులకు సంబంధించిన అన్ని పథకాలకు కేటాయింపులు కొనసాగించారు. సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేయడమే లక్ష్యంగా జల వనరుల శాఖకు రూ.11,908 కోట్లు కేటాయించారు. మన బడి నాడు-నేడు కార్యక్రమానికి రూ.3500 కోట్లు.. వైద్య ఆరోగ్య రంగంలో నాడు-నేడు కార్యక్రమానికి రూ.2214.21 కోట్లు కేటాయించారు. పేదల గృహ నిర్మాణాలకు రూ.6291.70 కోట్లు, కాపుల సంక్షేమానికి రూ.4,887 కోట్లు, వైఎస్సార్ ఈబీసీ నేస్తంకు రూ.610 కోట్లు కేటాయించారు. రైతులకు ఉచిత విద్యుత్ సరఫరా కోసం రూ.6,546 కోట్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీకి రూ.2,400 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వానికి రూ.532 కోట్లు కేటాయించారు.

2022-23 సవరించిన అంచనాలు

2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన అంచనాల ప్రకారం మొత్తం బడ్జెట్ వ్యయం రూ.2,40,509.34 కోట్లుగా ఉంటుందని ఆర్థిక మంత్రి బుగ్గన తెలిపారు. రెవెన్యూ వ్యయం రూ.2,05,555.95 కోట్లు కాగా, మూల ధన వ్యయం రూ.16,846.69 కోట్లు అని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు దాదాపు రూ.29,107 కోట్లు కాగా, ఇదే కాలానికి ద్రవ్యలోటు రూ.47,716 కోట్లు అని చెప్పారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో రెవెన్యూలోటు 2.21% కాగా, ద్రవ్యలోటు 3.62 శాతంగా ఉందని పేర్కొన్నారు.

రెవెన్యూ వ్యయం	మూలధన వ్యయం	మొత్తం ఆదాయం
రూ.2,28,540.71 కోట్లు	రూ.31,061.04 కోట్లు	రూ.2,79,279.27 కోట్లు

కేంద్ర పన్నుల వాటా రూపంలో రూ.41,338.02 కోట్లు

కేంద్ర గ్రాంట్లు	రెవెన్యూ లోటు	ద్రవ్య లోటు
రూ.46,834.64 కోట్లు	రూ.22,316.70 కోట్లు	రూ.54,587.52 కోట్లు

బడ్జెట్ స్వరూపం

రెవెన్యూ రాబడి	రూ.2,06,224.01 కోట్లు
ప్రజా రుణం	రూ.72,022.09 కోట్లు
రుణాల రికవరీ	రూ.56.32 కోట్లు
పబ్లిక్ అకౌంట్స్	రూ.976.85 కోట్లు
మొత్తం రాబడి	రూ.2,79,279.27
రెవెన్యూ వ్యయం	రూ.2,28,540.71 కోట్లు
మూల ధన వ్యయం	రూ.31,061.04 కోట్లు
రుణ చెల్లింపులు	రూ.18,411.42 కోట్లు
రుణాలు & అడ్వాన్స్	రూ.1,266.10 కోట్లు
మొత్తం వ్యయం	రూ.2,79,279.27 కోట్లు

సొంత సంస్థల్లోకి మళ్లిస్తున్నారు

- మార్గదర్శి.. మరో అగ్రిగోల్డ్, సహారా కాకముందే చర్యలు చేపట్టాం
- విచారణ 'పరిధి' అంశం పెండింగ్‌లో ఉండగా క్వాష్ పిటిషనా?
- తెలంగాణ హైకోర్టుకు నివేదించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
- మార్గదర్శి పిటిషన్‌పై తీర్పు రిజర్వు చేసిన న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్ ఫండ్స్ సంస్థ తన ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును సొంత సంస్థల్లోకి మళ్లిస్తోందని, అవి నష్టాల్లోకి వెళ్తే వేలాది కుటుంబాలు వీధిన పడతాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హైకోర్టుకు నివేదించింది. మార్గదర్శి మరో అగ్రిగోల్డ్, సహారా మాదిరిగా కాకముందే జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని తెలిపింది. దీనికి సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నందున పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు వెల్లడించింది. ప్రభుత్వానికి ఏ సంస్థ అయినా ఒకటేనని, అక్రమాలపై ఉక్కుపాదం మోపేందుకు వెనుకాడబోమని తేల్చి చెప్పింది. ఆంధ్రప్రదేశ్‌లో తమ సంస్థకు చెందిన పలు బ్రాంచ్‌లపై నమోదైన కేసులను కొట్టివేయాలని / దర్యాప్తుపై స్టే ఇవ్వాలని అభ్యర్థిస్తూ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ తెలంగాణ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేసింది. విచారణను ఏపీలో కాకుండా మరో రాష్ట్రంలోని దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని, అప్పటివరకు ఎలాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరింది. దీన్ని గురువారం విచారణకు చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ సురేందర్ రెగ్యులర్ కేసులకు ఇబ్బంది లేకుండా సాయంత్రం 4.30 గంటల తర్వాత వాదనలు విన్నారు. పిటిషనర్ తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా, ఏపీ ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి సుదీర్ఘ వాదనలు వినిపించారు. విచారణ 'పరిధి', కేసు మెరిట్ అంశాలపై వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు.

పునర్విభజన చట్టానికి విరుద్ధం

'మార్గదర్శి అక్రమాలపై 409, 477(ఏ), 420 సహా పలు సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఇవన్నీ పదేళ్లకు పైగా శిక్ష పడే కేసులే. ఏపీలో నమోదైన కేసులపై ఇక్కడ రిలీఫ్ కోరలేరు. ఒకట్రెండు అంశాల్లో మినహా ఏపీ హైకోర్టు పరిధిలోని అంశాలపై తెలంగాణ హైకోర్టు కలుగజేసుకునే అవకాశం లేదు. ఇది ఏపీ పునర్విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. కేసులు నమోదైన నేరాలన్నీ ఏపీలోనే జరిగాయి. దర్యాప్తు చేస్తున్న పోలీసులూ అక్కడి వారే. అలాంటప్పుడు ఇక్కడ అరెస్టులు చేయవద్దని కోరడం చట్ట విరుద్ధం. హైకోర్టుల పరిధికి సంబంధించి సుప్రీంకోర్టు కూడా పలు సందర్భాల్లో స్పష్టంగా పేర్కొంది. ఏపీ హైకోర్టు పరిధిలో కలుగజేసుకోలేమని ఇదే హైకోర్టు కూడా పలు తీర్పులను ఇచ్చింది' అని ఏపీ ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ గోవిందరెడ్డి నివేదించారు. 'పరిధి' అంశం తేలకుండానే మళ్లీ క్వాష్ పిటిషన్ దాఖలు చేయడం దర్యాప్తును అడ్డుకోవడమే అవుతుందన్నారు. ఖాతాదారుల నుంచి వసూలు చేసిన నగదును మ్యూచువల్ ఫండ్స్, షేర్ మార్కెట్లలోకి అక్రమంగా మళ్లిస్తున్నారని చెప్పారు. చిట్స్ పేర డబ్బులు సేకరించి ఉషాకిరణ్ లాంటి సంస్థల్లోకి మళ్లిస్తున్నారని తెలిపారు.

మరో రాష్ట్రానికి మార్చండి..

'మార్గదర్శి కేంద్ర కార్యాలయం హైదరాబాద్‌లో ఉంది. ఇక్కడి నుంచే బ్రాంచ్‌ల పర్యవేక్షణ జరుగుతుంది. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఇక్కడే ఉంటారు. అందుకే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాం. దర్యాప్తును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలి. ఖాతాదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకున్నా తనిఖీలు చేస్తున్నారు' అని సిద్దార్థ లూథ్రా పేర్కొన్నారు.

'స్థానిక' ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్

- మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకున్న వైఎస్సార్‌సీపీ
- 5 స్థానాల్లో ఏకగ్రీవం
- ఎన్నికలు జరిగిన 4 స్థానాల్లోనూ జయకేతనం
- కొనసాగుతున్న పట్టభద్రులు, టీచర్ల ఓట్ల లెక్కింపు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసింది. మొత్తం 9 స్థానాలనూ కైవసం చేసుకుంది. వీటిలో 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన మిగతా 4 స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఈ నాలుగు స్థానాలకు ఈనెల 13న పోలింగ్ జరిగింది. గురువారం ఓట్లు లెక్కించారు. శ్రీకాకుళం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నుంచి నర్తు రామారావు, కర్నూలు జిల్లా నుంచి మధుసూదన్, పశ్చిమ గోదావరి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి వంకా రవీంద్రనాథ్, కవురు శ్రీనివాస్ ఘనవిజయం సాధించారు. ఈ నాలుగు స్థానాల్లోనూ సంఖ్యా బలం లేకపోయినా స్వతంత్రుల ముసుగులో పోటీ చేసిన టీడీపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలయ్యారు. కాగా, 3 పట్టభద్రుల నియోజకవర్గాలు, 2 ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కొనసాగుతోంది. స్థానిక సంస్థల కోటాలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి, కర్నూలు, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి, పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు స్థానాలు మొత్తం 9 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వీటిలో అనంతపురం, వైఎస్సార్, చిత్తూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, తూర్పు గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎస్.మంగమ్మ, పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, మేరుగ మురళీధర్, కుడిపూడి సూర్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

జిల్లా వార్తలు

పెసరలో పల్లాకు తెగులు ఉధృతి



కొణిజర్లలో పెసర పంటను పరిశీలిస్తున్న ఏఓ

కొణిజర్ల: యాసంగిలో సాగు చేసిన పెసర పంటకు పల్లాకు తెగులు సోకుతోంది. ఈమేరకు కొణిజర్ల మండల కేంద్రంలోని పలువురు రైతులు సాగు చేసిన పెసర పంటను ఏఓ డి.బాలాజీ పరిశీలించి సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగు వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుండగా, పూత రాకుండా దిగుబడి తగ్గిపోతుందని తెలిపారు. ఈమేరకు పల్లాకు తెగులు కనిపించిన మొక్కలను తొలగించి చేనుకు దూరంగా పడవేయాలన్నారు. వేప నూనె 5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని, తెగులు ఉధృతి ఆధారంగా ఎసిఫేట్ ఒక గ్రామును లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ఎం.డీ.ఆఫ్రిన్, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై మినుముల విత్తనాలు

రఘునాథపాలెం: జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఎండాకాలంలో అపరాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం 'మినీ కిట్స్-సమ్మర్ పల్సస్ 2023' కార్యక్రమం ద్వారా రాయితీపై మినుముల విత్తనాలు అందిస్తోంది. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని రఘునాథపాలెం ఏఓ ఇంటూరి భాస్కరరావు సూచించారు. రైతులు ఏఈఓకు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్స్ ఇచ్చి నాలుగు కేజీల బరువైన విత్తనాల సంచి తీసుకోవచ్చని తెలిపారు. కాగా, పంటకాలం 65 నుంచి 75 రోజులు ఉంటుందని, నీటి వసతి ఉన్న వారే సాగు చేసుకోవాలని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 19 మంది ఎంపిక



నియామకపత్రాలు అందజేస్తున్న దృశ్యం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 19మంది ఉద్యోగాలు సాధించారు. ప్రైవేట్ సంస్థల్లో నలభై పోస్టులకు గాను పెద్ద సంఖ్యలో అభ్యర్థులు హాజరు కాగా 19 మందిని ఎంపిక చేశారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కొండపల్లి శ్రీరాం పర్యవేక్షణలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.

జీసీసీలో గోల్‌మాల్

- అకౌంటెంట్‌పై సస్పెన్షన్ వేటు
- గతంలోనూ నలుగురు సస్పెండ్

పాల్వంచరూరల్: గిరిజన సహకార సంస్థ (జీసీసీ)పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతో అవినీతి, అక్రమాలు సర్వసాధారణమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం లక్ష్మీదేవిపల్లిలోని పాల్వంచ బ్రాంచ్ జీసీసీలో అకౌంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి.సంజీవరావు హాస్టళ్లకు నిత్యావసర సరుకుల సరఫరా గోదాం ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. గతేడాది నవంబర్ నుంచి జనవరి వరకు ఆయన ఈ విధులు నిర్వర్తించగా, ములకలపల్లి, అశ్వాపురం, జూలూరుపాడు, కొత్తగూడెం, పాల్వంచ, బూర్గంపాడు మండలాల్లోని 21 గిరిజన వసతి గృహాలు, ఐదు గురుకుల పాఠశాలలు, ఒక ఏకలవ్య పాఠశాలకు నిత్యావసర సరుకుల సరఫరా జరిగేది. ఈ క్రమంలో 20 రోజుల కిందట డీఎం విజయ్‌కుమార్ గోదాంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రూ.3.20 లక్షల విలువైన సరుకులు లేకపోవడమే కాక, కొన్ని సరుకులు అధికంగా ఉన్నట్లు గుర్తించారు.



పాల్వంచలోని జీసీసీ కార్యాలయం

అవకతవకలు నిజమే..

జీసీసీ గోదాంలో రికార్డుల ప్రకారం సరుకులు లేకపోవడంతో అక్రమాలు జరిగినట్లుగా గుర్తించిన డీఎం విజయ్‌కుమార్ అకౌంటెంట్‌పై చర్యలు తీసుకోవాలంటూ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు. దీంతో సంజీవరావును విధుల నుంచి తొలగిస్తూ గిరిజన సంక్షేమ శాఖ ఎండీ క్రిస్టినా జెడ్ చోంగ్తు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని డీఎం గురువారం వెల్లడించారు. అలాగే, సరుకుల గోల్‌మాల్ వ్యవహారంపై విచారణాధికారిగా పద్మావతిని నియమించినట్లు తెలిపారు. విచారణ పూర్తయితే గోదాంలో ఎంత మేర అక్రమాలు జరిగాయో తేలనుంది. కాగా, గోదాము ఇన్‌చార్జ్‌గా



గోదాంలోని సరుకులు

ప్రస్తుత మేనేజర్ అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తుండగా, సీనియర్ సేల్స్‌మెన్‌కు బాధ్యతలు అప్పగించనున్నట్లు సమాచారం.

గతంలోనూ అక్రమాలు

లక్ష్మీదేవిపల్లిలోని జీసీసీ గోదాంలో గతంలో కూడా అక్రమాలు బయటపడ్డాయి. జీసీసీ గోదాం ఇన్‌చార్జ్‌గా వెంకటేశ్వర్లు ఉన్న సమయాన బియ్యం నిల్వల్లో తేడా రావడంతో గత ఏడాది నవంబర్‌లో ఆయనను సస్పెండ్ చేశారు. అలాగే, రూ.లక్షల విలువచేసే ముష్టిగింజలు మాయమైన ఘటనలో గోదాం ఇన్‌చార్జ్‌గా ఉన్న కృష్ణతోపాటు అప్పటి భద్రాచలం మేనేజర్ శంకర్, సేల్స్‌మెన్ వీరస్వామిపై వేటు వేశారు.

డీసీసీబీ ఆధ్వర్యాన అప్పు వసూలు

సిబ్బందిపై దాడి చేసిన యువకుడు



ముజ్జుగూడెంలో అప్పు వసూలు చేస్తున్న ఉద్యోగి

నేలకొండపల్లి: మండలంలోని ముజ్జుగూడెంలో నేలకొండపల్లి డీసీసీబీ శాఖ ఆధ్వర్యాన ఉద్యోగులు గురువారం ఆస్తుల జప్తునకు శ్రీకారం చుట్టారు. జేఎల్‌జీ రుణాల చెల్లింపుల్లో జాప్యం చేసిన పలువురికి నోటీసులు ఇచ్చినా స్పందించలేదని చెబుతూ ఉద్యోగులు గ్రామానికి వచ్చారు. అయితే, ప్రస్తుతం పరిస్థితులు బాగాలేనందున కొంత సమయం ఇవ్వాలని స్థానికులు కోరినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో 15 మంది అప్పటికప్పుడు అప్పు తెచ్చి రుణాలు చెల్లించగా, మిగతా వారి పత్తి బస్తాలు, వాహనాలను, ఇతర వస్తువులను జప్తు చేశారు. ఈ క్రమంలోనే శ్రీను అనే యువకుడి ఇంటి వద్దకు ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి డీసీసీబీ బ్రాంచ్‌ల సిబ్బంది చేరుకుని హడావుడి చేయడంతో ఆయన కూసుమంచి బ్రాంచ్ ఉద్యోగి నారాయణపై దాడి చేశాడు. దీంతో బ్రాంచి మేనేజర్ ఇందుతో కలిసి నారాయణ నేలకొండపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత సిబ్బంది మండలంలోని రామచంద్రాపురంలో జప్తు కొనసాగించారు. సొసైటీ సీఈఓలు సత్యాల కోటయ్య, వీరబాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపలకూరతో విద్యార్థులకు భోజనం!



విద్యార్థులకు చేపలకూర వడ్డిస్తున్న సర్పంచ్ సంజీవయ్య

తిరుమలాయపాలెం: సాధారణంగా గ్రామాల్లోని చెరువుల్లో చేపలు పడితే ఆ రోజు ఊరంతా దాదాపు అందరి ఇళ్లలో చేపల కూర వాసన ఘుమఘుమలాడుతుంది. ఈ క్రమంలో తిరుమలాయపాలెం మండలంలోని సుబ్లేడు చెరువులోనూ గురువారం మత్స్యకారులు చేపలు పట్టారు. దీంతో ఎస్ఎంసీ చైర్మన్ కామళ్ల వీరయ్య సొంత ఖర్చులతో చేపలను తెప్పించి జిల్లా పరిషత్ పాఠశాలలో వండించి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించారు. సర్పంచ్ పోలెపొంగు సంజీవయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చామకూరి పార్థసారధి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తంతో ఎంపీ నామ పెయింటింగ్



రక్తంతో గీసిన చిత్రపటాన్ని ఎంపీకి ఇస్తున్న భార్గవ్

ఖమ్మంమయూరిసెంటర్: బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఫొటోను రక్తంతో పెయింటింగ్ వేయించి ఆయన పుట్టినరోజు సందర్భంగా అందజేసి ఓ వ్యక్తి అభిమానాన్ని చాటుకున్నారు. ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన నామ సేవా సమితి సభ్యుడు మునిగంటి భార్గవ్ బుధవారం జరిగిన ఎంపీ పుట్టిన రోజు సందర్భంగా తన రక్తం తీసి ఒక ఆర్టిస్ట్‌తో ఎంపీ బొమ్మ వేయించారు. గురువారం నామ సేవా సమితి సభ్యులు పాల్వంచ రాజేశ్, కృష్ణప్రసాద్ తదితరులతో కలిసి ఢిల్లీ వెళ్లి ఎంపీకి అందజేశారు.

'వెనిగళ్ల'కు అమెరికాలో సన్మానం



వెనిగళ్ల రవిని సన్మానిస్తున్న తానా బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్న చేతన ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెనిగళ్ల రవికుమార్‌ను తానా ఫౌండేషన్ బాధ్యులు సన్మానించారు. వాషింగ్టన్‌డీసీలో బుధవారం జరిగిన సమావేశంలో తానా ప్రతినిధులు సతీశ్ వేమన, రామ్‌చౌదరి, సాయిసుధ ఆధ్వర్యాన ఆయనను సన్మానించి మాట్లాడారు. పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ల్యాప్‌టాప్‌లు ఇస్తుండడంతో పాటు ఫీజు చెల్లిస్తున్న రవి సేవలు మరువలేనివని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెనిగళ్ల రేణుక తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ రహదారుల మాటేమిటి?

కేంద్రాన్ని ప్రశ్నించిన ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రహదారులు, జాతీయ రహదారుల పురోగతితో పాటు పెండింగ్ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు గురువారం లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మూడేళ్లలో దేశ వ్యాప్తంగా ఎన్ని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేశారు? ఇంకా ఎన్ని ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయో వెల్లడించాలని కోరారు. దీనిపై కేంద్ర జాతీయ రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చేందుకు ప్రతిపాదనలు స్వీకరిస్తూనే ఉన్నామని తెలిపారు. ఇది నిరంతర ప్రక్రియ అని, కనెక్టివిటీ అవసరాలు, నిధుల లభ్యత, ట్రాఫిక్ ఆధారంగా రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్పుతామని వివరించారు.

గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలుశిక్ష

ఖమ్మంలీగల్: గంజాయి రవాణా కేసులో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఆర్.డానీరూత్ బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2019 ఫిబ్రవరి 19న పోలీసులు ఖమ్మం ఆర్టీసీ బస్టాండ్‌లో తనిఖీ చేస్తుండగా ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు చెందిన కేలోతు రామోజీ, భూక్యా కౌసల్యగా వారిని గుర్తించి తనిఖీ చేయగా రెండు కేజీల గంజాయి లభ్యమైంది. ఈ కేసు విచారణలో భాగంగా నిందితులపై నేరం రుజువు కావడంతో మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. కాగా, రామోజీ కోర్టుకు హాజరుకాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయగా, కౌసల్యను పోలీసులు జైలుకు తరలించారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ కొత్తా వెంకటేశ్వరరావు వాదించగా సిబ్బంది ఎం.రామకృష్ణ, ఎం.వెంకటేశ్వర్లు, ఎండీ.అయూబ్ సహకరించారు.

అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం

పరిశీలించిన అధికారులు

చర్ల: మండలంలోని మారుమూల అటవీ ప్రాంతాల్లో రహదారులు నిర్మించేందుకు గురువారం అటవీ శాఖ, రోడ్లు భవనాల శాఖ అధికారులు సంయుక్తంగా పరిశీలించారు. మండలంలోని బత్తినపల్లి, రాళ్లాపురం, ఎర్రంపాడు, తిమ్మిరిగూడెం, బట్టిగూడెం, రామచంద్రాపురం, చెన్నాపురం తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి మూడేళ్ల కిందటే నిధులు మంజూరైనా అటవీశాఖ అనుమతి రాలేదు. తాజాగా అటవీ శాఖకు ఆర్అండ్‌బీ శాఖ అధికారులు లేఖ రాయడంతో ఇరుశాఖల అధికారులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. గ్రామాల్లో సుమారు 15 కి.మీ. మేర రహదారితో పాటు కలివేరు నుంచి తిప్పాపురం మీదుగా చెన్నాపురం వరకు నిర్మించనున్న డబుల్ రోడ్డు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలించి, అటవీ భూమి ఎంత కేటాయించాల్సి వస్తుందనే అంశంపై చర్చించారు. డీఎఫ్ఓ రంజిత్‌నాయక్, ఎఫ్‌డీఓ బాబు, చర్ల రేంజ్ ఆఫీసర్ ఉపేంద్ర, ఆర్అండ్‌బీ డీఈ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.



రాళ్లాపురంలో రహదారి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు